# కొడుకులకు విషమిచ్చి.. తానూ ఉరేసుకొని..

- ఇద్దరు చిన్నారులు సహా ఉపాధ్యాయిని బలవన్మరణం
- బోరబండలో ఘటన


జ్యోతి(ఫైల్)


అర్జున్(ఫైల్)


ఆదిత్య(ఫైల్)

ఎర్రగడ్డ, అక్టోబర్ 13: పిల్లలు బుడిబుడి అడుగులేస్తుంటే చూడాలని ఏ తల్లి మనసు ఆరాటపడదు? బుజ్జిబుజ్జి మాటలను వింటూ కాలం గడపాలని ఏ అమ్మకు మాత్రం ఉండదు? కానీ తనకు ఆ భాగ్యం లేదనుకుంది! ఒక కొడుకు మాట్లాడలేడు, మరో కొడుకు నడవలేడు. ఈ వింత వైకల్యం తన సంతానానికే రావాలా.. అని ఆ మాతృ హృదయం ఎంతగా మథనపడిందో! శుక్రవారం పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభమయ్యాయి విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లారు. ఆ ఉపాధ్యాయురాలు మాత్రం శాశ్వతంగా సెలవు పెట్టి తన ఇద్దరు కొడుకులతో సహా ఈ లోకం విడిచివెళ్లింది. ఈ హృదయ విదారక సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్నది. రాజ్‌నగర్‌కు చెందిన విజయ్‌కుమార్, జ్యోతి (32) దంపతులకు అర్జున్ (4), ఆదిత్య (2) సంతానం. జ్యోతి బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్. ఆమె భర్త విజయ్‌కుమార్ సెంట్రింగ్ కాంట్రాక్టర్. వీరి పెద్ద కొడుకు అర్జున్ నడవగలడు కానీ మాట్లాడలేడు. చిన్న కొడుకు ఆదిత్య మాట్లాడగలడు కానీ నడవలేడు. తన ఇద్దరు పిల్లల పరిస్థితి గురించి ఆలోచిస్తూ జ్యోతి తరచూ బెంగ పెట్టుకునేది. పలు దవాఖానాల్లో చికిత్స కోసం తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు. దీంతో మనస్తాపానికి గురైన జ్యోతి శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో పురుగుల మందు కలిపిన పాలను గ్లాసుతో కొడుకులకు తాగించింది. ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లగానే గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నది. ఎత్తుగా ఉన్న కిటికీకి చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పని మీద బయటకు వెళ్లిన విజయ్ ఇంటికి చేరుకున్నాడు. ముందు గదిలో కొడుకులిద్దరూ అచేతనంగా పడి ఉండటం చూసి షాక్‌కు గురయ్యాడు. భార్య లోపలి గదిలో కిటికీకి వేలాడుతూ కనిపించడంతో గుండెలు బాదుకున్నాడు. జ్యోతి తండ్రి వెంకటస్వామి ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు ఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. శవ పంచనామా అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానాకు తరలించామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ చెప్పారు. కాగా జ్యోతి, విజయ్ దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారని.. ఇద్దరు చిన్నారులను ప్రేమతో చూసుకునేవారని చుట్టుపక్కల వాళ్లు తెలిపారు. ఐతే జ్యోతి, విజయ్‌లది మేనరికం వివాహం అని తెలిసింది.

# 3 మృతదేహాలు.. పక్కన సైనైడ్ బాటిల్!

- అనుమానాస్పద స్థితిలో తండ్రీకూతుళ్లు మృతి
- భార్యపైనే అనుమానం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- బోయిన్‌పల్లిలో కలకలం రేపిన ఘటన


శ్రీకాంత్‌చారి (ఫైల్)

కంటోన్మెంట్, అక్టోబర్ 13: అందరూ నిద్రలేచి ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉండగా ఓ ఇంట్లో నుంచి అరుపులు, కేకలు వినిపించాయి. వెంటనే అక్కడికి చేరుకున్న ఇరుగూపొరుగు ఆ ఇంట్లో పడిఉన్న మూడు మృతదేహాలను చూసి షాక్‌కు గురయ్యారు. శుక్రవారం తెల్లవారు జామున ఓల్డ్ బోయిన్‌పల్లి భవానీనగర్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకున్నది. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి... శ్రీకాంత్ చారి (42) భవానీనగర్‌లో భార్య అక్షయ, కూతుర్లు స్రవంతి (8), శ్రావ్య (7)తో ఉంటున్నాడు. వృత్తిపనిలో గతంలో ఒక చేయి కోల్పోయిన శ్రీకాంత్ చారి ఓ సిల్వర్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీకాంత్ చారి ఉంటున్న ఇంటికి సమీపంలోనే అతని తల్లి జయమ్మ కూడా ఓ గదిలో ఉంటుంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో సొంతగా వ్యాపారం చేయాలనుకున్న శ్రీకాంత్ చారి తల్లి వద్ద రూ.10 లక్షలు అప్పుగా తీసుకుని ఇంట్లో పెట్టాడు. కొంత డబ్బు కనిపించకపోవడంతో భార్యాభర్తలకు గొడవలయ్యాయి. గురువారం ఉదయం కూడా భార్యతో గొడవ పడ్డ శ్రీకాంత్ చారి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగివచ్చాడు. భోజనం తర్వాత తల్లి తన గదికి వెళ్లిపోగానే భార్యాభర్తలు మళ్లీ అర్ధరాత్రి వరకు గొడవపడ్డారు. ఇంట్లో ఉన్న సైనైడ్‌ను అర్ధరాత్రి తర్వాత కూతుర్లకు తాగించి, తానూ సేవించినట్టు భావిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున భర్త, కూతుళ్లు మృతి చెంది ఉండడం చూసి అక్షయ తన అత్త జయమ్మ వద్దకు వెళ్లి చెప్పింది. ఘటనా స్థలంలో క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అక్షయ కనీసం ఏడవకపోవడం, మృతదేహాల పక్కన నిద్రమాత్రలు, మరో పక్క సైనైడ్ బాటిల్ ఉండటం, భర్త తనకు కూడా సైనైడ్ తాగించాలని చూశాడని అక్షయ చెబుతున్నదంటూ స్థానికులు ఆమెపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ఉజ్బెకిస్తాన్‌కు వైద్య విద్యార్థులు


వైద్య విద్యార్థులతో డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి తదితరులు

ఖైరతాబాద్, అక్టోబర్ 13 : ఉజ్బెకిస్తాన్‌లో వైద్య విద్యకు ఎంపికైన విద్యార్థులకు అభినందన.. వీడ్కోలు సభ శుక్రవారం సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి మాట్లాడుతూ.. ఉజ్బెకిస్తాన్ తాష్కెంత్ మెడికల్ అకాడమీలో అత్యంత తక్కువ ఫీజుతో విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేందుకు నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ మాజీ కమిషనర్ విజయబాబు, ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ విశ్వేశ్వరన్, ఉజ్బెకిస్తాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ భారతీయ అధికార ప్రతినిధి డాక్టర్ దివ్యా రాజ్‌రెడ్డి, ఉజ్బెకిస్తాన్ రాయబార కార్యాలయం ప్రతినిధి మహ్మద్, తాష్కెంత్ మెడికల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ శుక్రత్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సలీం, ఇంటర్నేషనల్ హెడ్ డాక్టర్ మురాద్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## సాహితీమూర్తుల కృషి.. భావితరాలకు స్ఫూర్తి


ధర్మనిధి సాహితీ పురస్కార గ్రహీత సాహితీవేత్త గుంజి వెంకటరత్నంతో వక్తలు

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 13 : సాహితీమూర్తుల కృషి భావితరాలకు స్ఫూర్తిని కలిగిస్తుందని ప్రముఖ రచయిత్రి డాక్టర్ సుజాతారెడ్డి అన్నారు. పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తమ గురువు నెల్లూరి వెంకటగిరి రాజా కళాశాల తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడిగా పనిచేసిన పోలూరి హనుమజ్జానకీ రామ శర్మ స్మారకార్థం పురస్కారం అందజేశారు. తెలంగాణ సారస్వత పరిషత్తులో నెలకొల్పిన ధర్మనిధి సాహితీ పురస్కారాన్ని శుక్రవారం ప్రముఖ సాహితీవేత్త గుంజి వెంకటరత్నంకు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.25వేలు నగదు, జ్ఞాపిక, శాలువాతో వెంకటరత్నంను సన్మానించారు. పోలూరి కుసుమ హరప్రసాదరావు రచించిన పోలూరి హనుమజ్జానకీ రామ శర్మ జీవితం, సాహిత్య పరిచయం గ్రంథాన్ని వక్తలు ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పంపించిన సందేశంలో భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల స్థానం తర్వాత భగవంతుని కంటే ముందు గురువుకు ఇచ్చి గౌరవించిందన్నారు. పరిషత్తు ఉపాధ్యక్షులు డాక్టర్ సుజాతారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య, డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు, డాక్టర్ గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు పాల్గొన్నారు. సాహితీమూర్తిగా హనుమజ్జానకీ రామ శర్మ చేసిన కృషిని కొనియాడారు.

# నగరంలో మొదటి పబ్లిక్ ఇ-వేస్ట్ కలెక్షన్ బిన్

- రోజుకు వెయ్యి కిలోల తడి-పొడి వేస్ట్‌ను రీసైక్లింగ్ సామర్థ్యం
- సివిటాస్‌తో కలిసి బల్దియా ఏర్పాటు




సిటీబ్యూరో, అక్టోబర్ 13(నమస్తే తెలంగాణ): నగరంలో మొట్టమొదటి పబ్లిక్ ఈ-వేస్ట్ కలెక్షన్ బిన్‌ను జీహెచ్‌ఎంసీ సహకారంతో సివిటాస్ ఏర్పాటు చేసింది. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను బాధ్యతాయుతంగా సేకరించి, రీసైక్లింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఎలక్ట్రానిక్ పరికరాల్లో ప్రమాదకర పదార్థాలు, టాక్సిన్స్ నుంచి పర్యావరణాన్ని కాపాడేందుకు ఇది నగరవ్యాప్తంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు సివిటాస్ ప్రతినిధులు తెలిపారు. ఇందుకు శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు హైస్కూల్ విద్యార్థులు రిత్విక్ జంపన, సిదీశ్‌రెడ్డి చొరవ తీసుకొని ఈ విధానంలో ఇ-వేస్ట్ రీసైక్లింగ్‌కు రూపకల్పన చేశారు. నగర నివాస సముదాయాల్లో ఇప్పటికే 20 ఇ-వేస్ట్, ఫాబ్రిక్ వ్యర్థాల సేకరణ డబ్బాలను ఏర్పాటు చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. ఎంకపల్లి, జీవన్‌గూడ ప్రాంతాల్లో వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను నెలకొల్పింది. ఇది రోజుకు వెయ్యి కిలోల తడి-పొడి చెత్తను రీసైకిల్ చేస్తుంది. నగరంలోని చెత్తసేకరణ చేసే 500 మందికి అవసరమైన ఆరోగ్య కిట్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. 200 యువతను ఈ కార్యక్రమంలో నిమగ్నం చేశామని, సమష్టి కార్యకలాపాల ద్వారా స్థిరమైన, సమగ్రమైన భవిష్యత్తు కోసం ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. మరో 5 పబ్లిక్ ఇ-వేస్ట్ బిన్లను ఏర్పాటు చేయడానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. తమ ప్రయత్నానికి కలిసి వచ్చేవారు +91 91541 85335, civitasorganisation@gmail.com కు మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని, civitasindia.org వెబ్‌సైట్ ద్వారా సందర్శించవచ్చని తెలిపారు.

## కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలు ఆగమయ్యాయి

**ఆత్మీయ సమ్మేళనంలో ఎల్బీనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి**

వనస్థలిపురం, అక్టోబర్ 13 :రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా విజయం బీఆర్‌ఎస్ పార్టీదేనని ఆ పార్టీ ఎల్బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం పార్థివాడలో కాలనీవాసులు తమ మద్దతు సుధీర్‌రెడ్డికేనని తీర్మానించారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గల్లీలో తిరిగానని, ఎక్కడ ఏ సమస్య ఉందో, ఆ సమస్యకు పరిష్కారమేందో తెలిసిన వ్యక్తినన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నిరంతరం ప్రజల కోసం, నియోజకవర్గం అభివృద్ధి కోసం పనిచేశానన్నారు. వేల కోట్లతో చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నదని తెలిపారు. ప్రజలంతా ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులపై చర్చించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా చేయాలన్నారు. దేశంలోనే ఆదర్శంగా ఉన్న తెలంగాణను దోచుకునేందుకు రెండు జాతీయ పార్టీలు తహతహలాడుతున్నాయని విమర్శించారు. ఆ పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలు ఆగమయ్యాయని, జాగ్రతగా ఉండాలని సూచించారు. ప్రజలు చూపిస్తున్న ఆదరణకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, కుంట్లూర్ వెంకటేశ్ గౌడ్, లగ్గోని శ్రీధర్, ఖైసర్, మధు గౌడ్, వేములయ్య, గడల రాజు నాయి, నవీద్, తదితరులు పాల్గొన్నారు.



## నడక దశాబ్ది గమనం పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, అక్టోబర్ 13 : తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో రచయిత ఎర్రోజు శ్రీనివాస్ రచించిన 'నడక దశాబ్ది గమనం' పుస్తకావిష్కరణ శుక్రవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే.సితారామరావు విచ్చేసి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పరాంకుశం వేణుగోపాలస్వామి, నరసింహారెడ్డి, డాక్టర్ ఎ.జయంతి తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ వర్సిటీ స్నాతకోత్సవం

శేరిలింగంపల్లి, అక్టోబర్ 13 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ జగదీశ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సౌందర్యరాజన్ తమిళిసై ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసించిన మొత్తం 1745 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఇందులో 294 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 166 మందికి బంగారు పతకాలు అందజేశారు. 2022 ఏడాదికి సంబంధించి ఉత్తమ బోధనను అందించిన 5 మంది అధ్యాపకులకు అవార్డులను అందజేశారు. యూనివర్సిటీస్ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ జగదీశ్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన దేశంలో నేటి తరం యువత ఎంతో అదృష్టవంతులన్నారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిలోని ప్రతిభ దాగిఉంటుందని, దానిని గుర్తించి వారు ఎంచుకున్న రంగాల్లో రాణిస్తే విజయవకాశాలు సొంతమవుతాయన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బీజే రెడ్డి, రిజిస్ట్రర్ దినేష్ నిగమ్‌తో పాటు వివిధ విభాగాల డీన్‌లు, ప్రొఫెసర్లు ఈ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు.